



ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణేది?

- వ్యాపారులతో కుమ్మక్కై పుస్తకాలు, యూనిఫాంలు అమ్మకాలు
- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు
- నిబంధనలు బేఖాతరు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

బెల్లంపల్లి, జూన్ 16: జిల్లాలోని కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తున్నాయి. పాఠశాలల్లో ఫీజులు ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. తమ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని, పాఠశాలల చివరలో టెక్నో తదితర పేర్లు తగిలించి 30 నుంచి 40 శాతం వరకు ఫీజులు పెంచుతున్నారు. దీనికి తోడు విద్యార్థుల యూనిఫాం, పుస్తకాలు ఆయా పాఠశాలలకు అనుబంధంగా ఉన్న కొన్ని షాపుల యజమానులతో బేరం కుదుర్చుకుంటున్నారు. తమ పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కడా లభించవని తాము చెప్పిన దుకాణంలోనే దొరుకుతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజీలు పంపుతూ తెలియజేస్తున్నారు. యూనిఫాంలు, పుస్తకాలు, అధిక ఫీజులు వసూలు చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లాలో అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● అధిక ఫీజుల వసూళ్లు

జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యా ర్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజుల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నా వసతులు కల్పించడంలో మాత్రం ప్రైవేటు పాఠశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో సామర్థ్యానికి మించి ఇరుకు గదుల్లో 40 నుంచి 50 మంది విద్యార్థులను కూర్చోబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ టాయిలెట్లు సైతం లేకపోవడంతో క్యూలో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

విద్యా ర్థులను పాఠశాలల్లో చేర్చుకునే సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో రూ.500 నుంచి 1500 వరకు, అడ్మిషన్ టెస్టు పేరుతో రూ.1000 నుంచి 1500ల వరకు తరగతిని బట్టి వసూలు చేస్తున్నారు. పలు పాఠశాలల్లో యూకేజీకి రూ.15 వేల నుంచి 20 వేల వరకు ఒక్కో పాఠశాలలో వసూలు చేస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఇంకా అదనంగా మరో 10 శాతం వరకు వసూలు చేస్తున్నారు.

● పుస్తకాలు, యూనిఫాంల అమ్మకాలు

ప్రైవేటు పాఠశాలల యజమానుల కనుసన్నల్లోనే యూనిఫాంలు, పుస్తకాల దుకాణాలు నడుస్తున్నాయి. ఇటీవల హైకోర్టు పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల అమ్మకాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేయడంతో పాఠశాలలకు దూరంగా షాపులను ఏర్పాటు చేసి పుస్త కాలు విక్రయిస్తున్నారు. బయట షాపుల్లో రూ.30కి దొరికే నోటు బుక్కు రూ.55కు విక్రయిస్తున్నారు. ఇలా పాఠశాలల ఆధ్వర్యంలో నడచే పుస్తకాల దుకాణాల్లో పుస్తకాలు కొంటే రూ.6 వేలు అయితే, బయట దుకాణాల్లో రూ.4 వేలకే వస్తున్నాయి. అయితే పాఠశాల యాజమా న్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు తాము ఏర్పాటు చేసిన దుకాణాల్లోనే పుస్తకాలను కొనుగోలు చేయాలని, బయట దుకాణాల్లో కొంటే పుస్తకాలను అనుమతించమని పేర్కొంటున్నారు. దీంతో చేసేది లేక ఎక్కువ రేటుకు పుస్తకాలను కొనాల్సి వస్తుంది. అలాగే యూనిఫాంలు, షూ, టై, బెల్టుకు రూ. 2 వేల నుంచి 4 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా ఫీజులు, యూనిఫాం, పుస్తకాల దందా కొనసాగిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాఠశాలల దోపిడీని అరికట్టాలి

- చిలుముల కృష్ణదేవరాయలు, విద్యార్థి సంఘ నాయకుడు



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పేరుతో విద్యార్థుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నారు. అలాగే పలు పాఠశాలల్లో అధిక ఫీజులు సైతం వసూలు చేస్తున్నారు. పాఠశాలల యజమానుల కనుసన్నల్లోనే పుస్తకాల దుకాణాలు నడుస్తున్నాయి. అధికారులు పాఠశాలల దోపిడీని అరికట్టాలి.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

ఏసీసీ, జూన్ 16: ముస్లింలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మసీదులు, దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో 15 రోజులుగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవాణాను జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పెట్టే పోస్టులను ప్రజలు నమ్మవద్దన్నారు. ఏదైనా సమస్యలుంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, అసత్యపు ప్రచారాలు చేసినా గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎస్టీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్, జూన్ 16 : మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో 600 మెగావాట్ల సామర్థ్యం గల రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. క్యాపిటల్ ఓవరాలింగ్‌లో భాగంగా శనివారం రాత్రి నుంచి ఉత్పత్తిని నిలిపివేశారు. ఓవరాలింగ్ పూర్తి చేయడానికి నెల రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

మంత్రి సీతక్కకు సన్మానం



మందమర్రిటౌన్, జూన్ 16 : రాష్ట్రమంత్రి సీతక్కను అఖిల బారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దపల్లిలో ఆరేండ్ల బాలిక హత్య ఘటనను పరిశీలించేందుకు వచ్చిన మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిశాలువాలతో సన్మానించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు ఉన్నారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయాలి

ఏసీసీ, జూన్ 16 : బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో చేపట్టే దీక్షలో బీసీ కులాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కుమార్ దీపక్



కలెక్టర్ కుమార్‌దీపక్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 16: ప్రజా శ్రేయస్సు, జిల్లా అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన కుమార్ దీపక్ ఆదివారం కలెక్టర్‌గా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అములు చేస్తున్న పథకాల ఫలాలను జిల్లాలో అర్హత గల ప్రతీ ఒక్కరికి అందే విధంగా అధికార యంత్రాంగంతో కలిసి పనిచేస్తానన్నారు. కుమార్ దీపక్‌కు అదనపు కలెక్టర్‌లు రాహుల్, సబావత్ మోతిలాల్, ఆర్డీవో రాములు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్‌లు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. నాగర్ కర్నూల్‌లో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కుమార్‌దీపక్ పదోన్నతిపై మంచిర్యాల కలెక్టర్‌గా వచ్చారు. ఫిబ్రవరి 1, 2023 నుంచి ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బదావత్ సంతోష్ బదిలీపై నాగర్‌కర్నూర్ వెళ్లారు.

శ్రీరాంపూర్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్‌ను శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణి గెస్ట్‌హౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జీఎం వెంట క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

జిల్లాలో కురిసిన మోస్తరు వర్షం

చెన్నూరు, జూన్ 16: మండలంలోని తుర్కపల్లిలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. జోరుగాలితో కురిసిన వర్షానికి మీసాల మల్లక్క వృద్ధురాలి ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. ఇంటిపైన ఉన్న రేకులు పడడంతో మల్లక్క తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గాలి దుమారం, ఉరుములతో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఎండతో ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడి వర్షం పడడంతో ఉపశమనం పొందారు. వ్యవసాయ పనులను ప్రారంభిస్తామని రైతులు పేర్కొన్నారు.

మందమర్రిరూరల్(కాసిపేట): కాసిపేట మండలంలోని మామిడిగూడెం గ్రామపంచాయతీలోని గోండుగూడలో కురిసిన వర్షానికి వరద నీరు ఇండ్లలోకి చేరింది. ప్రజలు నీటిని తీసివేసేందుకు ఇబ్బందులు పడ్డారు. నిత్యవసర వస్తువులు తడిచిపోయాయి. కాసిపేట నుంచి మామిడిగూడెం వరకు వేసిన ఆర్ అండ్‌బీ రోడ్డు రైల్వేగేటు వద్ద నాలా నిర్మించకపోవడంతో వరద నీరు సమీపంలోని ఇండ్లలోకి చేరింది. గ్రామస్థులు రోడ్డును తవ్వడంతో నీరు వెళ్లిపోయింది.



చెన్నూరులో ఎగిరిపోయిన ఇంటిపైకప్పు రేకులు, పిడుగుపాటుతో మృతిచెందిన గొర్రెలు, ఇండ్లలోకి చేరిన వరద నీరు

పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి

వేమనపల్లి: సూరారం గ్రామ శివారులో గొర్రెల మందపై పిడుగు పడడంతో 15 గొర్రెలు మృతిచెందాయి. కన్నెపల్లి మండలం మొక్కంపల్లి గ్రామానికి చెందిన మేకల రాజయ్య, హేమంత్‌లకు చెందిన గొర్రెలు మృతిచెందాయి. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

దండేపల్లి, జూన్ 16: పిల్లపాపలను చల్లంగా చూడాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని మామిడి పల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దిరాజు, పెద్దమ్మతల్లి కల్యాణ వేడుకలను వైభ వంగా నిర్వహించారు. ఐదేళ్లకోసారి పెద్దమ్మతల్లి ఆలయంలో పంబాలి పూజారుల సమక్ష్యంలో కల్యాణం నిర్వహిస్తారు. అందులో భాగంగా రెండు రోజుల నుంచి పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు నెత్తిమీద బోనం ఎత్తికుని డప్పుచప్పులతో పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. ముదిరాజ్ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మామిడిపల్లి పెద్దమ్మ ఆలయంలో పూజలు

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ముత్యంపల్లిలో క్రికెట్ కిట్‌లను అందజేస్తున్న ఏసీపీ, క్రీడా కిట్‌లు అందిస్తున్న సీఐ, ఎస్ఐ

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 16: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, దుబ్బపల్లి గ్రామాల్లోని యువకులకు పోలీసులు మీకోసంలో భాగంగా క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఏసీపీ మాట్లాడుతూ నేటి యువత దేశానికి దిక్సూచీ అని, సన్మార్గంలో పయనించాలన్నారు. గంజాయి, మద్యం, జూదం లాంటి వాటికి దూరంగా ఉండాలని, కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. పోలీసు శాఖ క్రీడలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, యువకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. ఆదివారం కాశిరెడ్డిపల్లిలో పోలీసులు మీ కోసంలో భాగంగా యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్‌లను అందజేశారు. సీఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు కేంద్ర బిందువు యువత అని, యువత తలుచుకుంటే దేనినైనా సాధించవచ్చన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధారుడ్యం పెరుగుతుందన్నారు. చదువుపై దృష్టి పెట్టి ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లి దండ్రులు కన్న కలలను నిజం చేయాలన్నారు. తాళ్లగురిజాల ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భీమిని: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. భీమిని, పెద్దపేట గ్రామాల యువకులకు, విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీచేశారు.

బెల్లంపల్లి(తాండూర్): కిష్టంపేట, అంకుశం గ్రామాల్లోని యువకులకు పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ కిరణ్ క్రికెట్, వాలీబాల్ కిట్‌లను అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడ ల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

కన్నెపల్లి: మెట్‌పల్లిలోని యువకులకు ఎస్ఐ గంగారాం క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి ఉద్యోగాలు సాధించవచ్చన్నారు.

తెలుగుభాష, కవిత్వంపై ఆసక్తి పెంచాలి



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మలయశ్రీ

ఏసీసీ, జూన్ 16 : తెలుగుభాష, కవిత్వంపై యువత, విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలని తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, కవి ముత్యాబోయిన మలయశ్రీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడారు. తెలుగుభాష, కవిత్వం కోసం జిల్లా సాహితీ సంరక్షణ సమితి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగీత సాహిత్య సుధావాహిని అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్రీనాథ్‌గౌడ్, భూపతి సంతోష్, గణపురం సంతోష్, దండనాయకుల వామన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూటీఎస్



చెక్కును అందజేస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

జన్నారం, జూన్ 16: ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూటీఎస్ ఉంటుందని సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు దేవాజీ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకుని అకాల మరణం చెందిన ఉపాధ్యాయులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తిరిగి చేపట్టేలా కృషి చేశామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, రవి, ఎంఈవో విజయ్‌కుమార్, నాయకులు రాజమౌళి, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రవీణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న దాగం రాజారాం

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 16: పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ఈనెల 18న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారాం పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అటవీ అధికారుల దౌర్జన్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, పోడు దారులపైన దాడులు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ అధికారుల దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పోడు రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, గిరిజన సంఘం నాయకులు, పోడు రైతులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

జన్నారం, జూన్ 16 : పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ, ఆదివాసీ రైతు సంఘం జిల్లా నాయకులు కనికరపు అశోక్, కొండగొర్ల లింగన్న, ఆత్రం రాజులు పేర్కొన్నారు. ఆదివారం జన్నారంలో వారు మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో పోడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు రైతులపై దాడులు చేస్తున్నారన్నారు. ధర్నాలో పోడు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, జయ, దుర్గయ్య , గంగన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 16: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ ఎన్నికల నిర్వహణ జేఏసీ నాయకులు మొయ్య రాంబాబు, గుడికందుల రమేష్‌లు తెలిపారు. ఆదివారం సింగరేణి పాఠశాల మైదానంలో మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన అంశాలపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాలకవర్గం లేకపోవడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని, మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. నాయకులు ఎన్నికలు జరిపిస్తామని హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత విస్మరిస్తున్నారన్నారు. ప్రజా ఉద్యమాలతోనే ఎన్నికలు సాధ్యమని, ప్రజలు, నాయకులు కలిసి రావాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, తిరుపతి, రాంబాబు, రవి, కిరణ్, శ్రీనివాస్, కాసర్ల రంజిత్, సాయి, వెంకటేష్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని రక్షించిన గ్రామస్థులు

జైపూర్, జూన్ 16: ముదికుంట గ్రామానికి ఆదివారం దారి తప్పి వచ్చిన చుక్కల దుప్పిని గ్రామస్థులు రక్షించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. నీలగిరి ప్లాంటేషన్‌లో సంచరిస్తున్న చుక్కల దుప్పిని చూసి కుక్కలు వెంటపడ్డాయి. వాటి నుంచి తప్పించుకుని గ్రామంలోకి వచ్చింది. గమనించిన గ్రామస్థులు కుక్కలను తరిమివేసి ప్లాంటేషన్ వాచర్ శంకర్‌కు సమాచారం ఇచ్చారు. ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించారు. చిన్న చిన్న గాయాలు కావడంతో పశువుల ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలేశారు. వాచర్ శంకర్, గ్రామస్థులు నాగపురి రాములు, దాసరి లవన్, రాజయ్య, పట్టెం రాజన్న, బన్నీ, రాజ్‌కుమార్, సతీష్, అభిలను అధికారులు అభినందించారు.

ఓట్ల శాతం తగ్గడంపై సమీక్ష

మందమర్రిటౌన్, జూన్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్‌లో ఓట్ల శాతం తగ్గడంపై చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సమీక్ష నిర్వహించారు. ఆదివారం మంచిర్యాలలోని నివాసంలో మందమర్రి పట్టణ, మండల బూత్ లెవెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయా బూత్‌లలో నమోదైన ఓట్ల శాతం పరిశీలించారు. దాదాపు 3 లక్షల నుంచి 4 లక్షల మెజార్టీతో గెలవాల్సి ఉండగా లక్షా 30 వేల మెజార్టీ రావడంపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులకు సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలన్నారు.

పిడుగులతో జాగ్రత్త : అప్రమత్తతోనే రక్షణ

కాసిపేట, జూన్ 16: వర్షాకాలం ప్రారంభంలో ఈదురుగాలులు, పిడుగులు పడుతుంటాయి. అప్రమత్తతోనే వాటి నుంచి రక్షణ పొంద వచ్చు. పిడుగుపాటుకు ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదై సాయంత్రం గాలులతో పిడుగులు పడుతుంటాయి.

-పిడుగులను గుర్తించడం ఇలా

ఆకాశంలో నల్లటి కారుమబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులు చల్లని గాలులు పిడుగుపాటుకు సంకేతాలు. పిడుగు మేఘాల నుంచి భూమి ఉపరితలాన్ని తాకే అతి శక్తివంతమైన విద్యుత్ ప్రవాహం. పాజిటివ్, నెగిటివ్ ఛార్జీలు ఒకదాన్ని ఒకటి ఆకర్షించి విద్యుచ్ఛక్తి పుడుతుంది అదే పిడుగు. ఒక్క పిడుగు సుమారు 30 వేల కోట్ల వాట్స్ విద్యుచ్ఛక్తిని కలిగి ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పిడుగులు ఎత్తైన కొండ ప్రాంతాలు, చెట్లు, సెల్‌ఫోన్ టవర్లు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలపై ఎక్కువగా పడుతుంటాయి.

పిడుగుల బారిన నుంచి కాపోడుకోండి ఇలా..

- లోహపు పంపుసెట్ల వద్ద, నీళ్లలో ఉండకుండా చూసుకోవాలి.
- వర్షం పడుతున్నప్పుడు లోహపు పైపుల నుంచి వచ్చే నీటిని తాగరాదు.
-సెల్‌ఫోన్‌లు వాడవద్దు, ఇంట్లోని కరెంటు మెయిన్ స్విచ్ ఆఫ్ చేసుకుంటే మంచిది.
-ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఆఫ్ చేయాలి.
- ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు బైక్ నడపవద్దు
- వర్షం పడుతున్నప్పుడు కిటీకిల నుంచి మెరుపులను చూడవద్దు.
-పొలాల్లో పనిచేసేవారు, మేకల కాపరులు వర్షాలు వస్తున్నప్పుడు చెట్ల కింద ఉండవద్దు.

అప్రమత్తతతోనే పిడుగుల నుంచి రక్షణ

-అజయ్‌గౌడ్ , జిల్లా అగ్నిమాపక అధికారి

ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు బయటకు వెళ్లకూడదు. పిడుగు పడి మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతుంది. పశువుల కాపర్లు, పొలాల్లో పనిచేసే వారు వర్షం వచ్చినప్పుడు చెట్ల కిందకు చేరవద్దు. వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్‌తో పిడుగులు ఎక్కువగా పడుతున్నాయి.

ప్రత్యేక విపత్తు కింద పరిహారం

-మోతిలాల్, జిల్లా అదనపు కలెక్టర్

పిడుగు పడి మృతిచెందిన వారి కుటుంబానికి ఆపద్బంధు పథకం కింద ఆర్థిక సహాయం అందజేసేవారు. 2018 నుంచి బాధిత కుటుంబానికి ప్రత్యేక విపత్తు కింద రూ.6 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. దీనికి త్రిమెన్ కమిటీ ఆమోదించాలి. ఎఫ్ఐఆర్, మెడికల్ ఆఫీసర్ ఇచ్చే పోస్టుమార్టం ఆధారంగా తహసీల్దార్ ధ్రువీకరించాలి. పిడుగులు పడే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. బయట తిరగవద్దు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొౌట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్ని వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆసల్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడ్డాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 16: తాండూర్ మండలంలోని రేపల్లెవాడ సమీపంలో ఆదివారం ఉదయం రైలు నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నితీష్‌కుమార్ (18) అనే యువకుడు ఆరు నెలల క్రితం అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి చెన్నైలో పనిచేయడానికి వెళ్లారు. చెన్నై నుంచి బీహార్‌కు సంఘమిత్ర రైలులో వెళ్తున్న క్రమంలో రేపల్లెవాడ వద్ద ప్రమాదవశాత్తూ రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

జన్నారం, జూన్ 16: మండలంలోని మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన సొమారపు ఉషాలు(55) బైక్ అదుపు తప్పి కిందపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సాయిలు చింతగూడ లక్ష్మీదేవి ఆలయం నుంచి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా వాహనం అదుపు తప్పి రాయికి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నాగలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఏసీసీ, జూన్ 16: మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎగ్గెన అంజన్న (45) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కూలీ పనులు చేసి జీవనం సాగించే అంజన్న ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



స్నేహశీల మృతదేహం

ఏసీసీ, జూన్ 16: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన జంజిరాల స్నేహశీల (38) అనే వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లక్షెట్టిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న స్నేహశీల 13 సంవత్సరాల క్రితం మహేష్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. భర్త మహేష్ ఏ పని చేయకుండా తాగుడు, పేకాట, జల్సాలకు అలవాటుపడ్డాడు. స్నేహశీల జీతం భర్త ఖర్చు చేయడం తోపాటు అదనపు కట్నం తేవాలని భర్తతోపాటు అత్తమామలు తరుచూ వేధించే వారని కుటుంబ సభ్యులు తెలిపారు. మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

జైపూర్, జూన్ 16: రసూల్‌పల్లె గ్రామం వద్ద ఆదివారం పశువులను తరలిస్తున్న రెండు ట్రాలీలను పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి రెండు ట్రాలీల్లో ఏడు పశువులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రసూల్‌పల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నామన్నారు. పశువులను తరలిస్తున్న శ్రీరాంపూర్ చెందిన షేక్ తస్యం, షేక్ అబ్దుల్లా అజీజ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 7 పశువులను మంచిర్యాలలోని గోశాలకు తరలించామన్నారు.

విద్యుత్ ప్రజావాణి

ఏసీసీ, జూన్ 16: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం అర్జీలను మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ ఎస్ఈ కార్యాలయంలో అందించవచ్చని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భీమారం, మంచిర్యాలలో జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

భీమారం, జూన్ 16: భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2008-09 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి ఒకరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, కృష్ణమూర్తి, రమాదేవి, రమేష్, ఓంప్రకాష్, పవన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్, అఖిల్, రాకేష్, మహేష్, అరుణ్, రాజబాబు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత మా అందర్ని గుర్తుంచుకుని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

ఏసీసీ: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు హాలులో ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. నర్సయ్య, ఆమ్రోస్, రమేష్, కోల వెంక టేష్‌గౌడ్, దశరథ్, పాల్గొన్నారు.

సాహిత్య సమ్మేళనంలో మండల వాసి

జైపూర్, జూన్ 16: మండలంలోని బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ ఆదివారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో శ్రీశ్రీ కళావేదిక, తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక సాహిత్య కవి సమ్మేళనంలో పాల్గొని కవిత్వాన్ని ఆలపించారు. సంస్థ సభ్యులు ప్రశంసా పత్రం అందించి సన్మానించారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉషారాణి, విశ్వ విద్యాలయం ఉప కులపతి కుసుమకుమారి తెలుగు, కన్న, తమిళ రాష్ట్రాల కవులు పాల్గొన్నారు.



కవిత్వాన్ని వినిపిస్తున్న రవితేజ

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

వేమనపల్లి, జూన్ 16: వేమనపల్లి మండలానికి చెందిన ఓయూ జేఏసీ కో ఆర్డినేటర్ దుర్గం మల్లేష్ ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినం సందర్భంగా హైద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నార్నూర్ ఎంపీటీసీ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ ఆలీ ఖాన్, మేకల మాణిక్యం, పసివుల్లా, రమేష్, రాజన్న, ఇందయ్య, గంగన్న, అజహర్, ఇమ్రాన్, నరసయ్య, మోసిన్ షాఖాన్, నర్సింగరావు, బాస్కర్‌గౌడ్, పాల్గొన్నారు.

రోడ్డుపై నిలుస్తున్న నీరు



నిలిచిన నీరు

భీమారం, జూన్ 16: మండల కేంద్రంలోని ఎస్టీ బంజారవాడలోని చర్చ్ సమీపంలో రోడ్డుపైనే నీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపై మురుగునీరు చేరడంతో కాలనీ వాసులు నడవడానికి ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుపై నిరు నిలువకుండా రోడ్డుకిరువైపులా మురికి కాలువలను నిర్మించాలని కోరుతున్నారు.

కుమరంభీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కుంర శంకర్

జైనూర్, జూన్ 16: ఆదివాసీల అభివృద్ధి కోసం జిల్లాలో కుమరంభీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంర శంకర్ డిమాండ్ చేశారు మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలోనే కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యంత వెనుకబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ఆదివాసులకు న్యాయం జరుగుతుందని ఆదివాసులు గంపెడాశలతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రి సీతక్క సైతం జిల్లాలో కుమరంభీం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారని వాటినిదృష్టిలో పెటుకొని ఆదివాసుల ఉన్నతికి ప్రభుత్వం దోహదపడాలని ఆయన కోరారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు పెందుర్ గణపతి, ఆత్రం మాధవ్‌రావ్, కుంర విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

చింతలమానేపల్లి, జూన్ 16: మండలంలోని గూడెం గ్రామశివారులో సర్వేనెం.9లో విస్తీర్ణం 8.21 ఎకరాల్లో అక్రమంగా ప్రవేశించి బూతులు తిట్టి చంపుతామని బెదిరించినఘటనలో ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సైనరేష్ తెలిపారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోయపల్లి గూడెం గ్రామానికిచెందిన గోలేటిమొండి, గోలేటిసంజీవ్, గోలేటి పోచయ్య, గోలేటి బొడ్డయ్య, గోలేటిశంకర్, గోలేటిరంగయ్య అనేవ్యక్తులు అక్రమంగా గోలేటి కమల భూమిలోకి ప్రవేశించి బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారని బాధితురాలు పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు గోలేటి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వృద్ధురాలి మృతి

బెజ్జూరు, జూన్ 16: పోతెపల్లి-బారెగూడ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి కిందపడ డంతో వృద్ధురాలు మృతిచెందింది. బెజ్జూరు ఎస్సై విక్రమ్ తెలిపినవివరాల ప్రకారం.. చింతల మానేపల్లి మండలంలోని కర్జవెల్లి గ్రామానికి చెందిన బూసి భీమక్క(60) ఆమె మనుమడు కుదురుపాక మహేష్ ఇద్దరుకలసి బైక్‌పై బెజ్జూరు మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామం లోని కూతురు ఇంటికి వెళ్తున్నారు. పోతెపల్లి గ్రామ సమీపంలో రాగానే బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో బండిపైనున్న భీమక్క అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కూతురు ఇంటిలో కొన్నిరోజులు ఉందామని వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి మనుమడు సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కర్జెల్లిలో విషాదఛాయలు..

చింతమాలనేపల్లి: భీమక్క మృతి చెందడంతో కర్జెల్లిగ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రెండునెలలక్రితమే మృతురాలి కుమారుడు శంకర్ అనారోగ్యంతో మృతిచెందగా ఇప్పుడు భీమక్క రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

తండ్రీ, కొడుకుల అదృశ్యం

చింతలమానేపల్లి, జూన్ 16: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన కుకడ్కర్ నందు(28), అతని చిన్న కుమారుడు విష్ణు(5) ఇద్దరు ఈనెల11 ఇంటి నుంచి బయటికి వెళ్లారు. తర్వాత ఇంటికి రాలేదు. వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికిన లభ్యం కాలేదు. దీంతో ఆదివారం కుకడ్కర్ నందు తండ్రి తండ్రి కుకడ్కర్ హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.



నందు



విష్ణు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

వాంకిడి/కౌటాల/సిర్పూర్(యు)/జైనూర్, జూన్ 16: వాంకిడి, కౌటాల, సిర్పూర్(యు), జైనూర్ సెక్షన్ కార్యాలయాల్లో ప్రతిసోమవారం ఉదయం 10నుంచి 1గంట వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్, ఏడీఈ రాజేశ్వర్, ఏఈ ఆదర్శ, ఇన్‌చార్జి ఏఈ సాయికిరణ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ అవకాశాన్ని వాంకిడి, సిర్పూర్(టి), కౌటాల చింతలమానేపల్లి, పెంచికలపేట, బెజ్జూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

భూ వివాదంలో ఘర్షణ

● కర్రలు, గొడ్డలితో దాడి ● అయిదుగురికి గాయాలు



గాయపడ్డ నానాజీ, మల్లేష్, గణేష్

బెజ్జూరు, జూన్ 16: బెజ్జూరు మండలంలోని అంబగట్టు గ్రామశివారులో ఆదివారం భూవివాదం తలెత్తగా ఒకరిపై ఒకరు కర్రలు, గొడ్డలితో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో అయిదుగురికి గాయాలయ్యాయి. అంబగట్టు గ్రామశివారులోని సర్వేనెం.71లో 13.44ఎకరాల భూమి ఉండగా ఆ భూమికి సంబంధించిన పట్టాదారులు పోరెశెట్టి జగదీష్, సుగుణాకర్, నానాజీ, నైతం సకారాం భూమిలో దున్నేందుకు వెళ్లగా మల్లేష్, విమల, సరోజ కలిసి అడ్డుకున్నారు. ఎన్నోఏళ్ల నుంచి భూమిసాగు చేసుకుంటున్నామని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించగా మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కర్రలు, గొడ్డలితోదాడి చేసుకున్నారు. ఈదాడిలో తలండి గణేష్, మల్లేష్, విమల, సరోజతోపాటు పోరెశెట్టి నానాజీకి గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని చికిత్సకోసం బెజ్జూరు ఆరోగ్యకేంద్రానికి తీసుకురాగా వైద్యులసూచన మేరకు మెరుగైన వైద్యంకోసం కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారు. కాగా ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు.

భూ వివాదంపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ కరుణాకర్

బెజ్జూరు, జూన్ 16: బెజ్జూరు మండలం మర్తిడి శివారులో భూవివాదంపై ఆదివారం కాగజ్‌నగర్ డీఎస్పీ విచారణ జరపారు. సర్వేనెంబరు 167/2, 167/3, 167/4లో 34.30 ఎకరాల భూమి కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల సురేష్ తోపాటు అన్నదమ్ములపై పట్టా ఉండగా ఆ భూమిలో భూపాలపల్లి జిల్లాకు చెందిన భిక్షపతిగౌడ్ అనేవ్యక్తి అడ్డపడి దున్నడంతో వివాదం తలెత్తింది. ఆ భూమిపై డీఎస్పీ కరుణాకర్ విచారణ జరిపారు. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించారు. సమగ్రవివరాలు రాబట్టేందుకు తహసీల్దార్‌కు లేఖ రాస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆయనవెంట కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై విక్రం ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువుల లారీ

బెజ్జూరు, జూన్ 16: మహారాష్ట్ర నుంచి హైదరాబా ద్‌కు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 36పశువులను బెజ్జూరు ఎస్సై విక్రం పట్టుకున్నారు. లారీ(ఎంహెచ్ 34బిజడ్ 4755)లో మహారాష్ట్రలోని విట్టలవాడ నుంచి పశువులను ఎక్కించుకొని హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పక్కాగా అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి కుంటలమానేపల్లి వద్ద మాటువేసి పట్టుకున్నారు. ఇందులో ఒక ఆవు చనిపోయిందని ఎస్సై తెలిపారు. డ్రైవర్ ప్రేందాస్, లారీయజమాని సాదిక్‌ఖాన్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నంబాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రెబ్బెన, జూన్ 16: మండలంలోని నంబాలలో జడ్పీహెచ్ఎస్ 2008-09 బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



విచ్చలవిడిగా బెల్టు షాపులు

- అధిక ధరలకు మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- కాసులు కురిపిస్తున్న దందా
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 16: జిల్లాలో బెల్టుషాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను తుంగలో తొక్కి పుట్టగొడుగుల్లా బెల్టుషాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా పట్టించుకోవాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేయటంతో ఈ దందా మూడు, పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. లక్షలు పెట్టి మద్యం షాపులు దక్కించుకున్న టెండరుదారులు బాహాటంగా బెల్టుషాపులకు సహకరిస్తూ మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా కూడా ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా వచ్చి నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తుకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు..

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో 30కిపైగా లైసెన్సు దుకాణాలుండగా, మండల కేంద్రాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ బెల్టుషాపులపై ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవటంతో వీరి వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. పగలు, రాత్రి ఏ సమయంలోనైనా మందు దొరుకుతుండటంతో మందుబాబులకు వరంగా మారింది. మద్యం దుకాణాల్లో విస్కీ, బ్రాండి ఒక క్వాటర్‌పై ఎంఆర్‌పీ ధర కంటే రూ.20నుంచి రూ.30మేర అదనంగా అమ్మి లాభాలు సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే ఒకబీర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు బాహాటంగానే వసూలు చేస్తున్నారు. లైసెన్సు దుకాణాల్లో మద్యం అమ్మకాలు చేయాల్సి ఉండగా, వచ్చిన స్టాక్ వచ్చినట్టే బెల్టుషాపులకు కొంత మంది యాజమానులు బాహాటంగానే తరలిస్తున్నారు. దీంతో ఇటు లైసెన్సు దుకాణాల యాజమానులు, అటు బెల్టుషాపుల నిర్వాహకులు లాభాలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా ఎక్సైజ్ అధికారులు కానీ టాస్క్‌ఫోర్స్ అధికారులు కానీ దాడులు చేసింది ఏమి లేదు. ఈ దుకాణాల వైపు చూసింది లేదు.

ఇటీవల ఓ మండలంలో కేవలం దేశీదారు పట్టుకొని చూపించారే తప్ప, మద్యం షాపులో దొరికిన మద్యం తరలింపు, సిబ్బంది రాకపోకలకు సంబంధిత యజమాని వాహనాన్నే వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. దొరికిన మద్యంతో ఆ వాహనంలోనే కాగజ్‌నగర్‌కు చేరుకోవడం విమర్శలకు దారితీసింది. అయా మండలాల్లో పట్టుకున్న మద్యం కాగజ్‌నగర్‌కు ఎక్సైజ్ కార్యాలయానికి చేర్చాల్సి ఉండగా అర్ధరాత్రి వేళ చేరుకొని పంచనామా చేశారు. గతేడాది నుంచి ఈ దుకాణాలపై కనీసం దాడులు కూడా చేయలేదంటే పరిస్థితి ఎంత ఎలా ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. ఫిర్యాదులు చేస్తే కూడా వచ్చి నామామాత్రపు తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇందుకు ఉదాహరణయే నాలుగు నెలల క్రితం చింతలమానేపల్లి మండలంలో బెల్టుషాపులో మద్యం దుకాణంలో లైసెన్సు షాపునకు చెందిన మద్యం లభిస్తే బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేయటం సర్వత్రాకు చర్చకు వచ్చింది. కాగా మద్యం ఏ దుకాణం నుంచి వచ్చిందో..? సంబంధిత దుకాణదారుడిపై కేసు నమోదు చేయాల్సి ఉండగా కేవలం బెల్టు షాపు నిర్వాహకుడిపై నామమాత్రపు కేసు నమోదు చేసి వదిలేయటం ఎక్సైజ్ అధికారుల తీరుపై చర్చకు దారితీసింది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని అంతా డిమాండు చేస్తున్నారు.



బెల్టు షాపులో లభించిన మద్యం బాటిళ్లపై పంచనామా నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

● కల్తీ మద్యం అమ్మకాల జోరు..

కాగా జిల్లాలోని పలుమండలాల్లో జోరుగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం లైసెన్సు దుకాణదారులే కొంతమంది ఈ దందాకు తెరలేపుతున్నారు. కల్తీచేయడం, బెల్టుషాపుల్లో అమ్మకాలు జరపడం ఆనవాయితీగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-ఎక్సైజ్ సీఐ రవి

మద్యం దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపుల నిర్వహిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అధిక ధరలకు మద్యం విక్రయించినా ఫిర్యాదులు చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తాం.

ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో దాడి చేశాడని ఫిర్యాదు

● చేయని నేరం ఒప్పుకోవాలని ఒత్తిడి చేశాడని యువకుడి ఆవేదన



ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వోపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొంటున్న అప్పాజీ శ్రీను

పెంచికలపేట, జూన్ 16: పెంచికలపేట రేంజ్ పరిధిలోని అటవీప్రాంతంలో నెల రోజులక్రితం ఎలుగుబంటి చనిపోయిన విషయం తెలిసిందే. ఆ ఎలుగు బంటిని చంపినట్లు ఒప్పుకోవాలని పెంచికలపేట ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుధాకర్ తనపై దాడి చేశారని బాధితుడు ఎల్లూరు గ్రామానికి చెందిన యువకుడు అప్పాజీ శ్రీను ఆరోపించాడు. బాధితుడి కథనం ప్రకారం.. పెంచికలపేట ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుధాకర్ తన సిబ్బందితో కలిసి విచారణ పేరుతో తనను ఈనెల11న ఉదయం 4గంటల ప్రాంతంలో ఇంటినుంచి స్థానిక అటవీశాఖ కార్యాలయానికి తీసుకుని వెళ్లాడు. చేయని నేరాన్ని ఒప్పుకోవాలని ఇష్టారీతిన విచక్షణ రహితంగా కొట్టడంతో కుడిచేతికి తీవ్రగాయమై ఎముక విరిగిపోయింది. ఈ మేరకు శ్రీను ఇన్‌చార్జి రేంజ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఇదే విషయమై ఇన్‌చార్జి రేంజ్‌అధికారి సుధాకర్‌ను సంప్రదించగా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు అప్పాజీ శ్రీనుపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారించామే తప్ప దాడి చేయలేదని పేర్కొన్నారు.

బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

● ఎస్పీ సురేష్ కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16: బక్రీద్ పండగను జిల్లా ప్రజలు సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లాలో బందోబస్తు నిర్వహించబోయే అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేశారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టకూడద న్నారు. ఎటువంటి సమాచారం తెలియజేయాలన్న డయల్ 100కు లేదా పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఎవరైనా వ్యక్తులు కావాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసినా లేదా ఏదైనా అవాంఛనీయ చర్యలకు పాల్పడినా వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మహాపాదయాత్రను విజయవంతం చేయండి

చింతలమానేపల్లి, జూన్ 16: ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మహాపాదయాత్రను సిర్పూర్ నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు విజయవంతం చేయాలని ఆసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, మండలాధ్యక్షుడు హరికృష్ణ కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాపాదయాత్రలో పెద్దసంఖ్యలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

● ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

దహెగాం, జూన్ 16: చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీచైర్మన్, ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై రాష్ట్రంలో ఇలాంటి దుశ్చర్యలకు ఎవరూ ఒడిగట్టకుండా స్త్రీల రక్షణార్థం ప్రభుత్వం కఠినచట్టాలను తీసుకువచ్చి అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థికసహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరె సంఘం రాష్ట్రఅధ్యక్షుడు శివాజీ, కన్వీనర్ రాజేష్, చందర్ రావు, రాంబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

9 కిలోమీటర్లు.. 37 మలుపులు

● ప్రమాదకరంగా కెరమెరి ఘాట్ రోడ్డు ● తరుచూ ప్రమాదాలు



ఘాట్ రోడ్డుపై బోల్తా పడ్డ లారీ(ఫైల్)

కెరమెరి, జూన్ 16: అసలే ఘాట్ రోడ్డు.. ప్రమాదకర మూలమలుపులతో కూడిన ఇరుకు రహదారి. అడుగుకో గుంత, రాళ్లు తేలిన మార్గం. ఇది జిల్లాలోని ప్రధాన రహదారి దుస్థితి. జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్‌లోని ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వరకు ప్రయాణించాలంటే నరకయాతనే. కెరమెరి ఘాట్ వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో గంటల కొద్ది వాహనాల రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. రెండు వరుసల రహదారి నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

ఏర్పాటు చేయని ప్రమాద సూచికలు..

మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో మూలమలుపు వద్ద ముందు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కెరమెరి ఘాట్‌లో 9కిలోమీటర్ల మేరకు 37మూల మలుపులు ఉన్నాయి. ఏ ఒక్క చోట సూచనలు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవు.

వారం రోజుల్లో మూడు ప్రమాదాలు..

వారం రోజుల వ్యవధిలో ఘాట్‌రోడ్డుపై మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈనెల 10న యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీ భూసిమెట్ట క్యాంపు రెండోమలుపు వద్ద అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌సకాలంలో తప్పుకోవడంతో ప్రాణపాయం తప్పింది. యూరియా సంచులు కింద పడిపోయాయి. అలాగే ఈ నెల14న ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు పత్తి గింజల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ కెరమెరి మండల కేంద్రంలోని ఘాట్ రెండో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. రోడ్డుకు ఓ వైపునకు బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తప్పింది. తాజాగా ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.



ఘాట్ రోడ్డుపై ఢీ కొన్న ఆర్టీసీ బస్సు, కారు (ఫైల్)

జిల్లాలో తేలికపాటి వర్షం

ఆసిఫాబాద్, జూన్ 16: జిల్లాలో ఆదివారం తేలికపాటి వర్షంకురిసింది. ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, జైనూరు, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, పెంచికలపేట, సిర్పూర్(టి), బెజ్జూరు మండలాల్లో వాతావరణం మేఘావృతమై తేలికపాటివర్షం కురిసింది.

చింతలమానేపల్లి/కెరమెరి/దహెగాం: మండలాల్లో ఆదివారంవర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి మొదట్లో వర్షం కురిసిన తరువాత రైతులు పత్తివిత్తనాలు వేయగా అప్పటినుంచి ఇప్పటివరకు వర్షంలేదు. ప్రస్తుతం వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తూ వేసిన పత్తివిత్తనాలు మొలకెత్తుతాయని సంతోషం వ్యక్తంచేశారు. విత్తనాలు వేయని వారు రేపటినుంచి వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోరెండు మూడు వర్షాలు కురిసినట్లయితే విత్తనాలు మొలకెత్తే అవకాశంఉంది. కాగా వర్షం కురవాలని పలుగ్రామాల్లో దేవతలకు రైతులు పూజలు, జలాభిషేకం నిర్వహించారు. దహెగాం మండలంలోని గిరివెల్లి సమీపంలోని ఎర్రవాగులో స్వల్పంగావర్షంనీరు ప్రవహిస్తోంది.



దహెగాంలో పొలంలో చేరిన వర్షపు నీరు

వర్షాలు కురవాలని పూజలు..

రెబ్బెన: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌లో ఆదివారం భక్తులు వర్షాలు కురవాలని దుర్గాదేవి ఆలయంలో బోనాలను సమర్పించారు. వివిధ గ్రామాలనుంచి భక్తులరావటంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

చిత్రకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 16: రాష్ట్రప్రభుత్వం చిత్రకారులను ఆదుకోవాలని టాస్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్‌రావు కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో తెలంగాణఆర్టిస్టుల సంక్షేమసమితి (టాస్) జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చిత్రకారులను గుర్తించివారిని అన్నివిధాల ఆదుకుంటూ వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇదేవృత్తిగా భావించి చిత్రకళమీదే ఆధారపడి కుటుంబాలను పోషించకుంటున్న చిత్రకారులు ఆర్థికంగా వెనకబడి పేదరికంలో మగ్గుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిస్టులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, రమణ, శంకర్, సత్యనారాయణ, కె.సత్యనారాయణ, రాజ్నాథ్, యాదగిరి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: జీఎం

శ్రీరాంపూర్, జూన్ 16: ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఎల్లందు క్లబ్‌లో అధికారులు, వారి కుటుంబసభ్యులకు ఆదివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జీఎం హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తమకు బొగ్గుఉత్పత్తి ఎంత ముఖ్యమో, ఉద్యోగుల ఆరోగ్యానికి కూడా అంతే ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. ఉదయం9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించిన శిబిరంలో 120మందికి పరీక్షలు చేశారు. శిబిరాన్ని డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి సమన్వయపరిచారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఏరియా ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

50పడకల ఆస్పత్రి నిర్మించాలి

శ్రీరాంపూర్, జూన్ 16: శ్రీరాంపూర్ ఏరియాలో 50పడకల ఆస్పత్రి నిర్మించాలని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో కోరారు. ఏరియాలో అన్నివిభాగాలు, గనుల్లో సుమారు పదివేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి, వారి కుటుంబ సభ్యులకు ఏదైనా అత్యవసరంగా వైద్యసహాయం కావాలంటే ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆర్కే8 డిస్పెన్సరీలో, నస్పూర్ డిస్పెన్సరీలో స్త్రీలు, పిల్లల వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్మికకాలనీల్లో దోమల నివారణ చర్యలు, పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

మందమర్రిటౌన్, జూన్ 16: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సీఎంపీఎఫ్ చిట్టీల ఆలస్యానికి సంబంధించి జీఎం కార్యాలయం సిబ్బందిపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సీఐటీయూబ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘంగా ఎన్నికై ఐదునెలలు కావస్తున్నా గుర్తింపు పత్రాన్ని తీసుకోవడం కూడా చేతకాని సంఘం నాయకులు సీఎంపీఎఫ్ చిట్టీల విషయంలో లేనిపోని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ పోరాడుతుందన్నారు.